క్లుప్తంగా

రూ.2 లక్షల బీమా పంపిణీ

పుంగనూరు : పెద్దపంజాణి మండలం ముతుకూరుకు చెందిన కళావతికి రూ.2 లక్షల బీమాను డీసీసీబీ ఏజీఎం ఆషాబీ మంగళవారం అందజేశారు. ఖాతాదారు చలపతి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన సతీమణికి చెక్కు అందించినట్లు ఏజీఎం తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ నాగప్రసాద్, సిబ్బంది ఆషియా, శ్రీవిద్య పాల్గొన్నారు.

వైభవంగా అంబలం పూజ

సదుం: నడిగడ్డ పంచాయతీలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్ప అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి వి.కోటలో 'గడప గడపకు'

వి.కోట: ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధవారం నుంచి వి.కోట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ యువరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తొలి రోజు గంగమ్మగుడి వీధి, బంగ్లాచేను, నారాయణనగర్, కుప్పం రోడ్డు, వినాయకనగర్ 4క్రాస్, గురువారం కరీంకాంప్లెక్స్, ఎంజీ రోడ్, భారత్‌నగర్, సాయి గార్డెన్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని సూచించారు.

జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు

గుడుపల్లె : ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రామాంజనేయులు హెచ్చరించారు. కోడి పందేలు ఏర్పాటు చేసినా కేసులు తప్పవన్నారు.

ట్యాక్స్ చెల్లించకుంటే చర్యలు

పుంగనూరు : వాహనాల ట్యాక్స్‌ను వెంటనే చెల్లించకుంటే చర్యలు తప్పవని ఆర్టీఏ యూనిట్ అధికారి రవీంద్రనాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆటో, ఎల్‌జీవీ, గూడ్స్ , కమర్షియల్ ట్రాక్టర్ల యజమానులు తమ వాహనాలకు ట్యాక్సులు చెల్లించాలని, లేకుంటే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

కురబ సంఘం అధ్యక్షుడిగా దామోదర్

పుంగనూరు : కురబ సంఘం మండలాధ్యక్షుడిగా దామోదర్ ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో దామోదర్ ఏకగ్రీవం అయినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరభద్ర, చంద్రశేఖర్, ఆంజి పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు

వి.కోట: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు అందుకోవాలని ఎంపీపీ యువరాజు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా అందించాలని కోరారు. తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని ఆదేశించారు. ఉత్తమ పనితీరు కనబరచిన అంబేడ్కర్ సచివాలయ సిబ్బందిని అభినందించారు. ఎంపీడీఓ బాలాజీ పాల్గొన్నారు.

భవనాలకు స్థల పరిశీలన

రామకుప్పం: మండలకేంద్రంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం తహసీల్దార్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి మంగళవారం స్థల పరిశీలన చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే స్థలంలోనే కార్యాలయాల భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. బాబురెడ్డి మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కోసం మరో కాలనీ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం భూమి కేటాయింపునకు రెవెన్యూ అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ మండల కో– కన్వీనర్లు చంద్రారెడ్డి, బాబురెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం

పుంగనూరు : పట్టణానికి చెందిన డాక్టర్ సరళ, విశ్రాంత హెచ్‌ఎం సరస్వతి, ఈశ్వరమ్మ, హసీనాబేగం, గాయత్రీదేవి, వహిదాబేగం, గంగులమ్మ, సుశీల, రెడ్డిరాజేశ్వరి, రెడ్డి రాధిక, హేమలత, గౌరి తదితరులు సావిత్రిబాయి పూలే అవార్డులు అందుకున్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించినందుకు మంగళవారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పురస్కారం పొందారు.

బైరెడ్డిపల్లె : తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ఎంఈఓ సాయిలీల, నెల్లిపట్ల ఆదర్శపాఠశాల హెచ్‌ఎం సురేఖ అవార్డు అందుకున్నారు.

తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు

రామకుప్పం: మండలంలోని వీర్నమల పంచాయతీ సన్యాసివంక గ్రామంలో తల్లీబిడ్డ అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన సహదేవన్ నాలుగేళ్ల క్రితం తమిళనాడులోని పూన ఐకంపట్టికి చెందిన విజజ(23)ను వివాహం చేసుకున్నాడు. వీరికి విష్ణు(1) అనే కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో సహదేవన్ ఆదివారం కూలి పని నిమిత్తం వి.కోటకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంట్లో భార్య, బిడ్డ కనిపించలేదు. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సహదేవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవ్విపోదురు గాక..!

- 2019 ఎన్నికల సమయంలో హడావుడిగా భూమి పూజలు
- 3 నెలల్లోనే సుమారు 300 శిలాఫలకాల ఆవిష్కరణ
- పూర్తికాని భవనాల ప్రారంభోత్సవం
- అప్పటి మంత్రి అమరనాథరెడ్డి జిమ్మిక్కులపై ప్రజల మండిపాటు

పలమనేరు : ప్రజలకు మేలు చేద్దామనే ఆలోచన లేదు.. దశాబ్దాలు మోసిన జనాలకు సక్రమంగా మౌలికవసతులు కల్పించాలనే ధ్యాస లేదు.. ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామనే ఆశయం లేదు.. కేవలం రాజకీయ లబ్ధి మాత్రమే కావాలి.. ఎన్నికలు వస్తేనే ప్రజలను గుర్తుచేసుకోవాలి.. మాయజేసి ఓట్లు దండుకోవడమే కావాలి.. ఇదే బాటలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి రాజకీయాలు చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో పలమనేరువాసులపై ఎక్కడలేని ప్రేమను కురిపించారు. అప్పటి వరకు గాలికి వదిలేసిన నియోజకవర్గ అభివృద్ధిని ఒక్కసారిగా భుజానికెత్తుకున్నారు. మూడు నెలల్లోనే సుమారు 300 పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించేశారు. రూ.300 కోట్ల వ్యయంతో శరవేగంగా నిర్మించేస్తామని హామీలు గుప్పించారు. అమరనాథుడి జిమ్మిక్కులు గుర్తించిన ఓటర్లు





మాజీ మంత్రి స్వగ్రామం కెళవాతిలో పనులు పూర్తి కాకుండానే అప్పట్లో ప్రారంభించిన అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు (ఇన్‌సెట్) వాటి శిలాఫలకాలు

కీలెరిగి వాతపెట్టడంతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు నిధులు మంజూరు చేయకుండానే శిలాఫలకాలతో కనికట్టు చేసి.. పూర్తి కాని నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేసేశారు. నేడు ఆయా పనులను చేపట్టడంలేదని ప్రభుత్వంపై నెపం నెట్టేస్తున్నారు. మాజీ మంత్రి ఆపసోపాలను చూసి పలమనేరు నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇప్పటికైనా మార్పు రాకపోతే రాబోయే ఎన్నికల్లో సైతం తిరస్కారం తప్పదని తేల్చేస్తున్నారు.

మంత్రిగా ఉన్నప్పుడు అమరనాథరెడ్డి హడావుడిగా భూమిపూజ చేసిన పనుల్లో మచ్చుకు మకొన్ని..

- పలమనేరులో జీప్లస్‌త్రీ పక్కా ఇళ్లు
- ఉపఖజానా కార్యాలయం
- వ్యవసాయశాఖ భవనం
- ఆడిటోరియం
- విశ్వబ్రాహ్మణుల కమ్యూనిటీ భవనం
- మోడల్ మార్కెట్
- కాపు భవనం
- దండపల్లె, గడ్డూరులో అంబేద్కర్‌భవనాలు
- బైరెడ్డిపల్లె గంటావూరులో కమ్యూనిటీ హాళ్లు

శిలాఫలకాలే కనిపిస్తున్నాయి



నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గత ఎన్నికల సమయంలో మాజీ మంత్రి వేసిన శిలాఫలకాలే కనిపిస్తున్నాయి. ఫలానా కార్యాలయం ఎక్కడా అంటే శిలాఫలకాన్ని చూపించాల్సిన పరిస్థితి. అసంపూర్తిగా ఉన్న భవనాలను ప్రారంభించి అదే అభివృద్ధి అంటున్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నాయి కాబట్టి, మళ్లీ మేమే అభివృద్ధి చేశాం అంటూ కల్లబొల్లిమాటలు చెబుతున్నారు. టీడీపీ హయాంలో జరిగింది ఏంటి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఎంత అనేది క్షేత్రస్థాయిలో చూస్తే తెలుస్తుంది. – వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు



2019 ఎన్నికలకు ముందు జనవరి, ఫిబ్రవరి, మార్చిలో భూమి పూజ చేసిన వదిలేసిన శిలాఫలకాల్లో కొన్ని..

6న మెగా జాబ్‌మేళా

పలమనేరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో 14 కంపెనీల ప్రతినిధులు హాజరై 1,500 మందికి ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు వివరించారు. పది నుంచి పీజీ వరకు అభ్యర్థులు పాల్గొనవచ్చని సూచించారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినికి ఉపకార వేతనం



జ్యోతికి స్కాలర్‌షిప్ అందిస్తున్న ఎంఈఓ

వి.కోట: మండలంలోని ముదరందొడ్డి ఉన్నతపాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని జ్యోతికి మంగళవారం ఎంఈఓ చంద్రశేఖర్ చేతులమీదుగా స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచిన జ్యోతిని ఉత్తర అమెరికా తెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి, డీఈఓ విజయేంద్రరావు ప్రోత్సాహంతో ఉపకార వేతనం అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలచైతన్య, సీఆర్పీ మునెప్ప పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లె పంచాయతీ పెద్దగానూరులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ సాగు విభాగం సిబ్బంది స్థానిక రైతు నారాయణరెడ్డి పొలంలో విత్తనాలు, నార్లు, తీగజాతి, గడ్డజాతి, ఆకుకూరలు, కాయగూరలు, పూలమొక్కలు తదితరాలను ఒకే ప్లాట్‌లో నాటించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలను భుజిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు.

చిరస్మరణీయులు సావిత్రిబాయి పూలే

పుంగనూరు : బడుగు బలహీన వర్గాలను విద్యావంతులగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. మంగళవారం బీసీ సంఘం నేతలు కృష్ణమూర్తి, గంగరాజు, అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి , విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసింహులు, సజ్జాద్, గంగులాచారి, శివయ్య, గంగులప్ప, మునిరామయ్య, వెంకటముని, వెంకట్రామయ్య, మునిరత్నం, వెంకటేష్, భాస్కర్, విజయమ్మ పాల్గొన్నారు.

పలమనేరు : పట్టణంలోని కళామందిరంలో సావిత్రబాయి పూలే జయంతి నిర్వహించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 15 మంది టీచర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తులసీనాథం నాయుడు, పుష్ప, ఆనందబాబు పాల్గొన్నారు. అలాగే పట్టణ బీజేపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పలమనేరు : ఉపాధ్యాయినిలను సన్మానించిన దృశ్యం



కుప్పంరూరల్ : మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కుప్పంరూరల్ : అడవిబూదుగూరు పాఠశాలలో సావిత్రిబాయి జయంతి సందర్భంగా టీచర్లు నాగమ్మ, ఉదయ్‌ను సర్పంచ్ మధుబాల, ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళ, సుమలత, ఇందిరమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

కుప్పం : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుడ్లనాయనిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు.

సదుం: జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రి కమిటీ సమావేశం

పుంగనూరు : పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి కమిటీ సమావేశాన్ని మెడికల్ ఆఫీసర్ యశ్వంత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ మాట్లాడుతూ పేద రోగులకు సేవలందిస్తూ ఆస్పత్రి దేవాలయంగా మారిందన్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటూ చికిత్సలందిస్తున్నట్లు వెల్లడించారు. కార్పొరేట్ తరహాలో వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఇనాయతుల్లా షరీఫ్, జానకి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బైరెడ్డిపల్లె: పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని చీలంపల్లె వద్ద మంగళవారం ద్విచక్రవాహనం ప్రమాదపు సూచిక బోర్డును ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. రామకుప్పం మండలం దేసినాయనిపల్లెకు చెందిన సోమిరెడ్డి(58), చంద్రారెడ్డి(53) పలమనేరు వైపు ద్విచక్రవాహనంలో వెళుతుండగా చీలంపల్లె వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డును ఢీ కొన్నారు. దీంతో సోమిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా చంద్రారెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

బైరెడ్డిపల్లె : టీడీపీ నేత అసత్య ప్రచారాలను దీటుగా ఎదుర్కొంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక షాదీమహల్‌లో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిసుంటే టీడీపీ నేతలు కల్లబొల్లి మాటలను తిప్పికొట్టాలని సూచించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి పాల్గొన్నారు.

పేదల కోసం.. పెంచిన పింఛన్

- సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తొలిస్థానం
- ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



బైరెడ్డిపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పుంగనూరులో.. అలీమ్‌బాషా, నరసింహప్రసాద్‌రెడ్డి



రొంపిచెర్లలో.. ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

గంగవరం : పేదల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని పెంచి అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. పింఛన్‌దారులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు సీఎం జగనన్న ఏటా పింఛన్ సొమ్మును పెంచుతున్నారని కొనియాడారు. ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మండలంలో డిసెంబర్ వరకు 7,884 మందికి పింఛన్ ఇస్తుంటే, ఇప్పుడు 8,172 మందికి పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ మండలంలోనే ప్రతి నెలా రూ.2.27 కోట్లు అందజేస్తున్నామని వెల్లడించారు. సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన వారు గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, జెడ్పీటీసీ సభ్యులు పార్వతి, వైస్ ఎంపీపీలు ఉమాదేవి, ఆదాంబాషా, సర్పంచ్ చంద్రమ్మ, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ఎంపీడీఓ శివప్రసాద్ పాల్గొన్నారు.

అవినీతికి తావులేని సంక్షేమం

బైరెడ్డిపల్లె : అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ హయాంలో 39 లక్షల మందికి పింఛన్లు ఇస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 68 లక్షల మందికి పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి పాల్గొన్నారు.

పుంగనూరు : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు. కొత్తగా 157 మందికి పింఛన్ అందించారు. చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు అర్హులందరికీ పింఛన్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే టిడ్కో ఇళ్ల ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు జయభారతి, కమలమ్మ, మమతారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయకృష్ణ, నాగరత్నమ్మ, రవితేజారెడ్డి, మహమ్మద్, బాలు, శంకర, అహమ్మద్ పాల్గొన్నారు.

కుప్పంరూరల్ : మండలంలోని చెక్కునత్తం, వానగుట్టపల్లె, పైపాళ్యం, పెద్దబంగారునత్తం, మంకలదొడ్డి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురుగేష్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వనిత పాల్గొన్నారు.

రామకుప్పం: ఎంపీడీఓ కార్యాలయ కొత్తగా పింఛన్ మంజూరైన వారికి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ మండల కో– కన్వీనర్ చంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.



శాంతిపురం : కడపల్లెలో.. జెడ్పీటీసీ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా పింఛన్ మంజూరైన 127 మందికి ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, రమణయ్య, సుధారాణి, సుష్మా, హేమలత పాల్గొన్నారు.

శాంతిపురం : మండలంలోని చిన్నారిదొడ్డి, మొరసనపల్లె, కడపల్లె, కర్లగట్టలలో గ్రామ సభలు నిర్వహించి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, కృష్ణమూర్తి, సర్పంచులు బాలసుబ్రమణ్యం, జగదీష్, గోవింద్, ఎంపీటీసీ సభ్యులు బీఎస్ వెంకటేశు, ఆర్ముగం, ఉమాదేవి, వెంకటాచలం, కో–ఆప్షన్ సభ్యుడు నిసార్ పాల్గొన్నారు.

గుడుపల్లె : మండలంలోని బెగ్గిలిపల్లె, శెట్టిపల్లె, పెద్దబదినవాడ, కంచిబందార్లపల్లెలో కొత్తగా మంజూరైన 179 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నాగభూషణం పాల్గొన్నారు.

సదుం: ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా పింఛన్ మంజూరైన 244 మందికి జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప నగదు పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.